# మహిళలకు ఆర్థిక భరోసా..



- లక్ష్యం దిశగా బ్యాంకు లింకేజీ రుణాల పంపిణీ
- 18,905 సంఘాలకు రూ.1032 కోట్లు లక్ష్యం
- 11,031 సంఘాలకు రూ.769 కోట్ల పంపిణీ
- నిజామాబాద్ జిల్లాలో 74.51 శాతం లక్ష్యం పూర్తి
- మహిళల ఆర్థిక సాధికారతే ధ్యేయంగా ముందుకు..



కమ్మర్‌పల్లి, డిసెంబర్ 10 : జిల్లాలో మహిళా ఆర్థిక సాధికారత కార్యక్రమాలు జోరుగా కొనసాగుతున్నాయి. గ్రామీణ ప్రాంతంలో పేదరిక నిర్మూలన కోసం చేపడుతున్న కార్యక్రమాల్లో మహిళా ఆర్థిక సాధికారత అందేలా మహిళలకు రుణాల పంపిణీ కార్యక్రమాలు కీలకంగా మారి అందుకు తగ్గ ఫలితాలను ఇస్తున్నాయి. గ్రామాల్లో ఎన్నో మహిళా స్వయం సహాయక సంఘాలు, సభ్యులు బ్యాంకు లింకేజీ రుణాలతో వ్యాపారాలు ఏర్పాటు చేసుకొని ఆదాయ బాట పడుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో వారికి ఇచ్చే రుణ పరిమితి గణనీయంగా పెంచడం.. మహిళలు మంచి ఆదాయాన్ని ఇచ్చే వ్యాపారాలు చేసుకోవడానికి, ఇది వరకే వారు నిర్వహించుకుటున్న వ్యాపారాలను మరింత వృద్ధి చేసుకోవడానికి ఎంతో దోహదపడుతున్నది.ఈ క్రమంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ స్వయం సహాయక సంఘాలకు రుణాల పంపిణీ పెద్ద ఎత్తున, జోరుగా కొనసాగుతున్నది. బ్యాంకు లింకేజీ రుణాల పంపిణీ లక్ష్యం దిశగా సాగుతున్నది.

**74.51 శాతం రుణ పంపిణీ పూర్తి**

నిజామాబాద్ జిల్లాలో ఈ సారి రుణాల పంపిణీ పెద్ద ఎత్తున జరుగుతున్నది. రుణ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు పెంచడంతో జిల్లాకు భారీగా రుణ లక్ష్యం వచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని మొత్తం 18,905 స్వయం సంఘాలకు రూ.1032 కోట్ల రుణాల పంపిణీ లక్ష్యాన్ని నిర్దేశించారు. క్రమంగా 2024 మార్చి వరకు ఈ లక్ష్యాన్ని పూర్తి చేయనున్నారు. ఐకేపీ అధికారులు, సిబ్బంది, బ్యాంకులు సమన్వయంతో లక్ష్యాన్ని చకచకా పూర్తి చేస్తూ మహిళల ఆర్థిక పురోభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నారు. ఈ నెల 8 వ తేది నాటికే 11,031 స్వయం సహాయక సంఘాలకు రూ.769 కోట్ల 53 లక్షల రుణాల పంపిణీ చేసి 74.51 లక్ష్యాన్ని పూర్తి చేశారు.

**మండలాల వారీగా పూర్తయిన లక్ష్యం**

జిల్లాలో మోస్రా మండలంలో 99.67 శాతం, నవీపేట్‌లో 92.38 శాతం, డిచ్‌పల్లిలో 85.96 శాతం, ఆర్మూర్‌లో 84.16 శాతం, రుద్రూర్‌లో 82.12 శాతం, నిజామాబాద్ రూరల్‌లో 81.94 శాతం, ఎడపల్లిలో 80.89, జక్రాన్‌పల్లిలో 80.73 శాతం, బాల్కొండలో 80.55 శాతం, ముప్కాల్‌లో 80.25 శాతం, చందూర్‌లో 80.16 శాతం, ఏర్గట్లలో 79.89 శాతం, కమ్మర్‌పల్లిలో 79.02 శాతం, నందిపేట్‌లో 78.05 శాతం, రెంజల్‌లో 77.01 శాతం, మెండోరాలో 75.89 శాతం, మాక్లూర్‌లో 74.02 శాతం, మోపాల్‌లో 70.77 శాతం, వేల్పూర్‌లో 70.17 శాతం, మోర్తాడ్‌లో 67.97 శాతం, కోటగిరిలో 67.86 శాతం, వర్నిలో 66.14 శాతం, ఇందల్వాయిలో 65.19 శాతం, బోధన్‌లో 64.88 శాతం, ధర్పల్లిలో 63.68 శాతం, భీమ్‌గల్‌లో 63.49 శాతం, సిరికొండ మండలంలో 59.72 శాతం లక్ష్యం పూర్తయ్యింది.

### మహిళా సాధికారతకు రుణాలు దోహదం..

మహిళా ఆర్థిక సాధికారతకు రుణాలు ఎంతో దోహద పడుతున్నాయి. స్వయం సహాయక సంఘాలు వ్యాపారాలు ఏర్పాటు చేసుకోవడానికి, ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి రుణాలు ఎంతో కీలకం. దీంతో రుణాల పంపిణీ లక్ష్యాన్ని ఎప్పటికప్పుడు పూర్తి చేస్తూ వస్తున్నాం. అవసరమైె సమీక్షలు నిర్వహిస్తూ జిల్లా కలెక్టర్ సలహాలు, సూచనలతో బ్యాంకు లింకేజీ రుణాలు సంఘాలకు త్వరగా అందేలా కృషి చేస్తున్నాం.



**-చందర్ నాయక్, డీఆర్డీవో పీడీ**

### కాంగ్రెస్ నాయకుడిపై
## పోలీసులకు ఫిర్యాదు

శక్కర్‌నగర్, డిసెంబర్ 10: కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ యువ నాయకుడు శనివారం అర్ధరాత్రి సమయంలో ఫోన్ చేసి పలుమార్లు తనను బెదిరించాడంటూ బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్ ఆదివారం బోధన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా ఎన్నికల్లో ఎందుకు ప్రచారం చేశావంటూ బెదిరింపులకు పాల్పడ్డాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అయితే, తనతో పాటు తమ పార్టీకి చెందిన పలువురికి ఇదే విధంగా బెదిరిస్తున్నాడని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో రవీందర్ యాదవ్‌తో పాటు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బెంజర్ గంగారాం, నాయకులు ఎంఎ రజాక్, రుద్ర సత్యనారాయణ, రవిశంకర్ గౌడ్, శంకర్ గౌడ్, నరేశ్ తదితరులు ఉన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ముప్కాల్, డిసెంబర్ 10 : మండలంలోని వెల్కటూర్ తండా శివారులో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ముప్కాల్ ఎస్సై భాస్కరాచారి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శరీరం పూర్తిగా కుళ్లిపోయి.. గుర్తు పట్టలేని విధంగా మారిందని తెలిపారు. నెల రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ట్రాక్టర్ బోల్తా : డ్రైవర్ మృతి

కమ్మర్‌పల్లి, డిసెంబర్10 : మండలంలోని చౌట్‌పల్లిలో శనివారం సాయంత్రం ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందినట్లు కమ్మర్‌పల్లి ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నయాగావ్ మండలం అంతర్గావ్ నుంచి తుకారామ్ హన్మత్ ఇబ్జిత్వర్(35) బతుకు దెరువు కోసం చౌట్‌పల్లికి ఐదు సంవత్సరాల క్రితం వచ్చాడు. తుకారామ్ పొలంలో ట్రాక్టర్‌తో రోటవేటర్ వేస్తుండగా ట్రాక్టర్ ప్రమాదవశాత్తు బోల్తా పడింది. తుకారామ్ ట్రాక్టర్ కింద పడి ఊపిరాడ మృతి మృతి చెందాడు. తుకారామ్ భార్య గోదావరి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

## డిచ్‌పల్లిలో వ్యాపారి కుచ్చుటోపీ !

- రూ. 15 కోట్లకు ఐపీ
- బాధితుల్లో ఎక్కువ సంఖ్యలో రైతులు

డిచ్‌పల్లి, డిసెంబర్ 10 : డిచ్‌పల్లి మండల కేంద్రంలో విత్తన దుకాణం, సిమెంట్ దందాను నడిపించే వ్యక్తి రూ.15 కోట్లకు ఐపీ పెట్టాడు. తాను వ్యాపారాల్లో నష్టపోయానంటూ ఐపీ పెట్టినట్లు తెలిసింది. ఈ వ్యాపారి డిచ్‌పల్లిలో కొన్నేండ్ల నుంచి వివిధ దుకాణాలు నడిపించడంతో అతడిని నమ్మిన కొంతమంది డబ్బులు ఇచ్చారు. వ్యాపారి ఐపీ పెట్టడంతో సుమారు 364 మంది నోటీసులు అందుకున్నట్లు తెలిసింది. ఇందులో ఎక్కువ మంది రైతులు ఉండడం గమనార్హం. పంటలు పండించిన డబ్బులను నమ్మి వ్యాపారి చేతికి ఇస్తే ఐపీ పెట్టడంతో ఆందోళన చెందుతున్నారు. ఒక్కొక్కరికి రూ.5లక్షల నుంచి రూ.50లక్షల వరకు డబ్బులు ఇవ్వాల్సిన వ్యాపారి ఐపీ పెట్టడంతో ఏం చేయాలో తెలియక సతమతమవుతున్నారు. వ్యాపారి కుమారుడు ఇంజినీర్ అని, బిల్డర్‌గా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. స్థానిక మండల కేంద్రంలోని ఓ కల్యాణ మండపం కూడా అద్దెకు తీసుకొని నడుపుతున్నట్లు సమాచారం. రూ.కోట్ల ఆస్తులు ఉన్న వ్యాపారి రూ.15కోట్లకు ఐపీ పెట్టడంతో ఏం జరిగి ఉంటుందోనని మండల వ్యాప్తంగా చర్చ జరుగుతున్నది. నోటీసులు అందుకున్న వారిలో వ్యాపారి బంధువులు కూడా ఉండడం గమనార్హం. బాధితులంతా కలిసి పోలీసులను ఆశ్రయించనున్నట్లు తెలిసింది.

## బస్సులో టికెట్ల పంచాయితీ

- బస్సులో ఇద్దరు మహిళలకు టికెట్లు జారీ
- కండక్టర్‌తో వాగ్వాదం..
- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- విచారణకు ఆదేశించిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్

శక్కర్‌నగర్, డిసెంబర్ 10: పల్లెవెలుగు బస్సులో ఓ కండక్టర్ ఇద్దరు మహిళా ప్యాసింజర్లకు టికెట్లు ఇచ్చిన సంఘటనపై ఆదివారం సాయంత్రం ఆర్టీసీ ఎండీ సజ్జనార్ విచారణకు ఆదేశాలు జారీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి... నిజామాబాద్ నుంచి బోధన్‌కు వస్తున్న పల్లెవెలుగు బస్సులో పలువురు ప్రయాణికులు ఎక్కారు. ఓ వ్యక్తి ముగ్గురికి టికెట్లు అడగడంతో కండక్టర్ నర్సింహులు అందులో ఇద్దరు మహిళలు ఉన్న విషయం తెలియకపోవడంతో ముగ్గురికి టికెట్టు పంచ్ చేశాడు. కాగా ఆ వ్యక్తి మహిళలకు ఫ్రీ కదా.. టికెట్టు ఎలా ఇస్తావని కండక్టర్‌ను నిలదీశాడు. మహిళా ప్యాసింజర్లు ఉన్నట్లు తనకు తెలియదని, డబ్బులు వాపసు ఇస్తానని చెప్పడంతో, మాకు డబ్బులు వాపసు ఎలా చేస్తావు... మహిళలకు టికెట్లు తీసుకోవద్దని తెలియదా అని అనడంతో వారి మధ్య స్వల్ప వివాదం సాగింది. దీన్ని వీడియో తీసిన వారు సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడంతో వైరల్ అయ్యింది. ఈ విషయం ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వరకు వెళ్లడంతో విచారణ చేపట్టాలంటూ సంబంధిత అధికారులకు ఆదేశాలకు జారీ చేశారు. ఈ విషయమై బోధన్ ఆర్టీసీ డీఎం శ్రీనివాస్‌ను వివరణ కోరగా, తమకు విచారణకు ఎండీ ఆదేశాలు జారీ చేసిన విషయం వాస్తవమే అని, సదరు ప్యాసింజర్‌ను పిలిపిస్తామని, విచారణ జరుపుతున్నామని, విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని ఆయన వివరించారు.

## ఘనంగా ఆలయ వార్షికోత్సవం



బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు, భక్తులు

రెంజల్, డిసెంబర్ 10: మండల కేంద్రంలో ఆదివారం ముత్యాలమ్మ ఆలయ 3వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు ప్రతి ఇంటి నుంచి బోనాలతో ఆలయానికి చేరుకొని పూజలు నిర్వహించారు. సర్పంచ్ రమేశ్ కుమార్‌తో పాటు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పోతరాజు మదన్, బొగిడి పోచయ్య, మాజీ సర్పంచ్ గైని సరస్వతి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
WANTED
★రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబికేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.